తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 103 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ బుధవారం 20 -11-2024 వెల: 5/రూ -


కేసీఆర్ అనే మొక్కను మళ్లీ మొలకెత్తనివ్వం

అధికారంలో ఉంటే దోచుకోవటం..

విపక్షంలో ఉంటే ఫామ్‌హౌసులో పడుకోవడమేనా?

దమ్ముంటే శాసనసభలో చర్చకు రా.. తేల్చుకుందాం!


తాగుబోతుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా కేసీఆర్

18 వేల కోట్ల ఆదాయంలో వడ్డీకే 6,500 కోట్లు

కిషన్‌రెడ్డి గులాంగిరి.. రాష్ట్రంలో ఉండే అర్హత లేదు


# కేసీఆర్.. కాస్కో

## అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పి మరీ ఓడించాం..



వరంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్‌ను ఓడిస్తానని ఆనాడు చెప్పి మరీ ఓడించానని, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కకుండా చేస్తానని చెప్పి మరీ గుండు సున్నా తెప్పించానని అన్నారు. కేసీఆర్ అనే మొక్కను తెలంగాణ గడ్డపై మళ్లీ మొలకెత్తనివ్వబోనని ప్రకటించారు. "కేసీఆర్.. కాస్కో, మా కార్యకర్తల పౌరుషమా.. నీ కుట్రలు, కుతంత్రాలా..

2లో




## వచ్చే ఏడాది భారత్‌లో పుతిన్ పర్యటన!

న్యూఢిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించే వీలుంది. దశాబ్దాల స్నేహం, బలమైన రక్షణ, వాణిజ్య బంధాలు, పరస్పరసహకారాలతో ఇరుదేశాల ద్వైపాక్షిక బంధం పటిష్టంగా ఉన్న నేపథ్యంలో వార్షిక పర్యటనల్లో భాగంగా వచ్చే ఏడాది పుతిన్ భారత్‌కు రావొచ్చని దౌత్యవర్గాలు మంగళవారం వెల్లడించాయి.

2లో

## జీశాట్-20 ప్రయోగం సక్సెస్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన అత్యాధునిక సమాచార ఉపగ్రహం జీశాట్-20 (జీశాట్-ఎన్2) మంగళవారం విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. ప్రైవేటు అంతరిక్ష పరిశోధన సంస్థ స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ 34 నిమిషాల అనంతరం ఈ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అమెరికాలోని ఫ్లోరిడా కేప్ కెనావెరాల్ వేదికగా ఈ ప్రయోగాన్ని చేపట్టారు. అనంతరం హసన్‌లో ఉన్న ఇస్రో మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ ఈ ఉపగ్రహాన్ని నియంత్రణలోకి తీసుకొన్నది.



2లో


స్పేస్‌ఎక్స్ సాయంతో నిర్ణీత కక్ష్యలోకి ఇస్రో ఉపగ్రహం

బరువు ఎక్కువగా ఉండటంతో స్పేస్‌ఎక్స్‌తో ఇస్రో జట్టు

మారుమూల ప్రాంతాలకుఇంటర్నెట్ కనెక్టివిటీ కోసమే

హైదరాబాద్: దేశంలో ఇంటర్నెట్ బ్రాండ్‌బ్యాండ్ సేవలను విస్తృతం చేయడానికి ప్రధానంగా ఈ ప్రయోగాన్ని చేపట్టారు. మారుమూల ప్రాంతాలతో పాటు అండమాన్ నికోబార్, లక్షద్వీప్ వంటి ద్వీపాల్లోనూ ఇంటర్నెట్ సేవలను అందించడమే ఈ ఉపగ్రహం లక్ష్యం. ఈ ఉపగ్రహం సాయంతో విమాన ప్రయాణ సమయంలో బ్రాడ్‌బ్యాండ్ సేవలు, వైఫై కనెక్టివిటీని మరింతగా మెరుగుపర్చే అవకాశం లభించనున్నది. జీశాట్ ఉపగ్రహం 14 ఏండ్ల పాటు సేవలు అందించనుంది.

2లో



## మహారాష్ట్రలో నేడే పోలింగ్

288 స్థానాలకు పోటాపోటీ

అన్ని ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం

వర్లి నియోజకవర్గంలో ఆసక్తికర పోటీ

2లో

## రాజ్యాంగంలో మతపరమైన రిజర్వేషన్లకు స్థానం లేదు

రిజర్వేషన్లు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి

మహారాష్ట్రలో చెప్పడం సరికాదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

లోడ్ పెరిగితే ట్రాన్స్‌ఫార్మర్లు

## పెట్టుకోవాలా?

ఆ భారం అపార్ట్‌మెంట్ వాసులపై వేస్తారా?

కరెంట్ నిర్వహణ, సరఫరా చేతకాక ప్రజలను ఇబ్బంది పెట్టే తుగ్లక్ చర్యలు ఆపాలి


ఈ విషయంలో సీఎం తక్షణమే స్పందించాలే..

లేదంటే పోరాటమే..
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో అదనంగా విద్యుత్ వినియోగం పెరిగిందంటూ దానికి ప్రజలే వ్యక్తిగతంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలని జనంపై భారం మోపేందుకు సిద్ధమైన

## విడాకులు తీసుకోనున్న ఏఆర్ రహమాన్ దంపతులు



## స్వచ్ఛ గ్రామాలు అందరి బాధ్యత



పోలవరం పూర్తయితే కరవుకు మంగళం

అమరావతి, పోలవరం ప్రాజెక్టులు రెండు కళ్లు

ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కాకూడదనే నిర్మాణ బాధ్యతలు

2027లోపు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం

సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి రహదారుల నిర్వహణ

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

# రాష్ట్రానికి పోలవరం జీవనాడి

అమరావతి: పోలవరం ప్రాజెక్టును 2027లోగా పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తున్నారనే వాదనలో వాస్తవం లేదని.. 45.72 మీటర్ల ఎత్తుకు ఎన్డీయే ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నాయన్నారు.

2లో



అమరావతి: పోలవరం ప్రాజెక్టును 2027లోగా పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తున్నారనే వాదనలో వాస్తవం లేదని.. 45.72 మీటర్ల ఎత్తుకు ఎన్డీయే ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నాయన్నారు. శాసనసభలో మంగళవారం పోలవరం, సాగునీటి ప్రాజెక్టులపై స్వల్పకాలిక చర్చ జరిగింది. 13 మంది ఎమ్మెల్యేలు ఈ అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. జనవరి నుంచి పోలవరం కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం ప్రారంభిస్తామని,

# రాజ్యాంగంలో మతపరమైన రిజర్వేషన్లకు స్థానం లేదు

(మొదటి పేజీ తరువాయి)



న్యూఢిల్లీ: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో మత పరమైన రిజర్వేషన్లకు స్థానం లేదని... ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ముస్లింలకు ఇస్తున్నట్టుగానే మహారాష్ట్రలో కూడా 4శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం సరికాదన్నారు. మంగళవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఆర్ఎస్ఎస్ వరిష్ట్ ప్రచారక్ నందకుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో హైకోర్టులు మతపరమైన రిజర్వేషన్లు రద్దు చేశాయని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని చెప్పాయని గుర్తు చేశారు. దీనిపై సుప్రీంకోర్టులో స్టే తీసుకొచ్చి మతపరమైన రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగంలో మతపరమైన రిజర్వేషన్లకు స్థానం లేదు..ఇది రాజ్యాంగ వ్యతిరేకం అని కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఆ కోర్టు తీర్పును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గౌరవించాలని సూచించారు. లగచర్ల అంశంపై చట్టం తనపని తాను చేస్తుందని, ఇది ముఖ్యంగా శాంతిభద్రతల సమస్య అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను రద్దు చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నానని తెలిపారు. హిందూ దేవాలయాల్లో పనిచేసే ఇతర మతాల వారిని వేరేచోట్లకు బదిలీ చేయాలని కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# స్వచ్ఛ గ్రామాలు అందరి బాధ్యత

## డంపింగ్ యార్డుల సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తాం

### గ్రామాల్లో యార్డుల ఏర్పాటు, నిర్వహణపై త్వరలోనే కొత్త విధానం

### శాసన మండలిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: గ్రామాలను స్వచ్ఛంగా, శుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రంలో త్వరలోనే డంపింగ్ యార్డుల ఏర్పాటు, నిర్వహణలపై ఒక విధానం తీసుకొస్తామని స్పష్టం చేశారు. మంగళవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డుల నిర్వహణ అవసరాన్ని గుర్తించామని, ఆ సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తామని చెప్పారు. వాటి నిర్వహణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. భూమి అందుబాటులో లేని నేపథ్యంలో 10 నుంచి 15 పంచాయతీలు కలిపి ఒక డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేస్తున్నామని, త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో 2015 నుంచి ఉపాధి హామీ పథకానికి అనుగుణంగా 10,808 గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులను చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ)గా అభివృద్ధి చేశామన్నారు. మిగిలిన 2,518 గ్రామ పంచాయతీల్లో ఈ కేంద్రాలు లేవని చెప్పారు. ఎస్‌డబ్ల్యూపీసీలు లేని పంచాయతీల్లో 2025-26లో నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న వాటిల్లో 9,382 పని చేస్తున్నాయన్నారు. వీటిల్లో పాక్షికంగా పనిచేస్తున్న 3826 ఎస్‌డబ్ల్యూపీసీలను మార్చి 2025 నాటికి పూర్తిగా పని చేసే స్థితికి అప్‌గ్రేడ్ చేస్తామని, పూర్తిగా పనిచేయని 1,426 ఎస్‌డబ్ల్యూపీసీలను పని చేసే స్థితికి తీసుకొస్తామని వివరించారు. ఏపీ మార్క్‌ఫెడ్ భాగస్వామ్యంతో వర్మీ కంపోస్ట్ విక్రయాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. పీఆర్ వన్ యాప్ ద్వారా ఎస్‌డబ్ల్యూపీసీల స్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తామని తెలిపారు. కాగా, గ్రామ సచివాలయ భవనాల రంగులకు 2019-24 మధ్య వైసీపీ హయాంలో రూ. 101.81 కోట్లు ఖర్చు అయ్యిందని పవన్ చెప్పారు.

# విడాకులు తీసుకోనున్న ఏఆర్ రహమాన్ దంపతులు

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: సంగీత సామ్రాట్, దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రహమాన్ దంపతులు తమ మూడు దశాబ్దాల వైవాహిక బంధానికి స్వస్తి పలకబోతున్నారు. ఈ విషయాన్ని రహమాన్ దంపతుల తరఫున ప్రముఖ విడాకుల లాయర్ వందనా షా ఒక సంయుక్త ప్రకటన మంగళవారం విడుదలచేశారు. " పెళ్లయిన చాన్నాళ్ల తర్వాత విడిపోవాలన్న కఠిన నిర్ణయానికి వచ్చారు. కొరవడిన భావోద్వేగాలే బంధం బీటలు పడటానికి కారణం. ఒకరిపై ఇంకొకరికి అమితమైన ప్రేమానురాగాలు ఉన్నాసరే అనూహ్య పరిస్థితులు వీళ్లిద్దరి మధ్యా పూడ్చలేని అగాథాన్ని సృష్టించాయి. బాధను దిగమింగి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ కష్టకాలంలో వ్యక్తిగత గోప్యతను గౌరవిస్తూ ప్రజలు సైతం ఈ విషయాన్ని అర్థంచేసుకుంటారని ఆశిస్తున్నాం. ఈ కష్టమైన దశను వీళ్లిద్దరూ దాటగలరని భావిస్తున్నా' అని లాయర్ వందనా షా ఆ అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. ' మా కుటుంబ ప్రైవసీని గౌరవించండి' అని రహమాన్ కుమారుడు అమీన్ సైతం ఇన్‌స్టా గ్రామ్‌లో ఒక పోస్ట్‌పెట్టారు. రహమాన్, సైరా బానూ వివాహం 1995 మార్చినెలలో చెన్నైలో జరిగింది. వీళ్లకు ఖతీజా, రహీమా, అమీన్ అనే పిల్లలున్నారు. వీళ్లది పెద్దలు కుదిర్చిన వివాహం.

# వచ్చే ఏడాది భారత్‌లో పుతిన్ పర్యటన!

పుతిన్ పర్యటన వేళ రష్యా ఏఏ అంశాలపై భారత్‌తో ఒప్పందాలు చేసుకోవచ్చు అనేది ఇంకా ఖరారుకాలేదని తెలుస్తోంది. ఈ ఏడాది జూలైలో భారత ప్రధాని నరేంద్ర మోదీ రష్యా రాజధాని మాస్కోలో పర్యటించి పుతిన్‌తో విస్తృతస్థాయి చర్చలు జరిపిన విషయం విదితమే. భారత్, రష్యాల మధ్య ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతంకానుందని మంగళవారం రష్యా అధ్యక్ష కార్యాలయం అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో పుతిన్ భారత పర్యటన ఖాయమని దాదాపు స్పష్టమైంది. మంగళవారం ఆయన భారత సీనియర్ సంపాదకులతో వర్చువల్‌గా మాట్లాడారు. " పుతిన్ త్వరలోనే భారత్‌లో పర్యటిస్తారు.

# రాష్ట్రానికి పోలవరం జీవనాడి

(మొదటి పేజీ తరువాయి)



రూ.70 వేల కోట్లతో గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం చేసి ప్రతి ఎకరాకూ నీళ్లిస్తామని చెప్పారు. తీరంలో పోర్టులు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.పోలవరం ప్రాజెక్టు ఇప్పటిది కాదని.. 1941లోనే ప్రతిపాదన వచ్చిందన్నారు. రామపాద సాగర్ పేరుతో భూమిని ఎంపిక చేశారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక పోలవరం ప్రాజెక్టును అస్తవ్యస్థం చేశారని చంద్రబాబు ఆరోపించారు. తెలంగాణలో ఉన్న 7 ముంపు మండలాలను ఏపీలో కలపకపోతే తాను సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనని పట్టుబట్టడం వల్లే కేంద్రం వాటిని ఏపీలో కలిపిందని చెప్పారు. అలా కలపకపోయి ఉంటే.. తెలంగాణ ఒప్పుకోకపోతే పోలవరం ఎప్పటికీ సాధ్యమయ్యేది కాదన్నారు. గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో కాంట్రాక్టర్‌ను మార్చిందని, 15 నెలల పాటు పోలవరం ప్రాజెక్టు పనులు నిలిపివేసిందన్నురు. 2020లో వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతింటే దానిని వెంటనే గుర్తించలేకపోయారన్నారు. కొత్త వాల్ నిర్మాణానికి రూ.990 కోట్లు ఖర్చవుతుందని వెల్లడించురు. ఆలస్యం వల్ల ప్రాజెక్టు వ్యయం పెరిగిందన్నారు. 2019 నాటికి 71.93 శాతం ప్రాజెక్టును తన హయాంలో పూర్తి చేస్తే గత ప్రభుత్వం హయాంలో 3.84 శాతం మాత్రమే పూర్తయ్యిందన్నారు. పర్సంటా, హాఫ్ పర్సంటా అని గత ప్రభుత్వంలో ఓ మంత్రి అవగాహన రాహిత్యంతో అవహేళన చేశారని, ఆయన పోయి మరో మంత్రి వచ్చారని, ఆయనకు టీఎంసీకి, క్యూసెక్కుకి తేడా తెలియదన్నారు. గత ప్రభుత్వం నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసిందని.. అంతకుముందు సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తూ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. కనీస నిర్వహణ లేక గత ప్రభుత్వంలో 1,040 ఎత్తిపోతల పథకాల్లో 450 మూతపడ్డాయన్నారు. నీటి వనరుల నుంచి లబ్ధి పొందే రైతులపైనా ఆయా సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ భారం వేయాలని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి సలహా ఇచ్చారు.

# లోడ్ పెరిగితే ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టుకోవాలా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. నగరంలోని అపార్ట్‌మెంట్ సముదాయాల్లో విద్యుత్ వినియోగం 20 కిలోవాట్ (కేవీ) దాటితే ఆయా అపార్ట్‌మెంట్ వాసులు సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవాలని టీఎస్ఎస్పీడీసీఎల్ నోటీసులిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన విద్యుత్ వినియోగానికి అనుగుణంగా నిర్వహణ చేతగాక ప్రభుత్వం ప్రజలపై భారం వేసే తుగ్లక్ చర్యకు పూనుకుందని ధ్వజమెత్తారు. విద్యుత్ ట్రాన్‌ఫార్మర్ల విషయంలో ప్రజలపై ఎలాంటి భారం మోపకుండా వాటిని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ వినియోగం పెరిగితే ఆ భారం ప్రజలపై వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్‌లో వినియోగం పెరిగిందని పైప్‌లైన్లు, రోడ్లను కూడా వేసుకోమని అనేట్టు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్న విషయాన్ని రేవంత్‌రెడ్డి సరార్ మరిచిపోయినట్టు ఉందని ఎద్దేవా చేశారు. 20 కేవీల విద్యుత్ లోడ్ దాటిన అపార్ట్‌మెంట్‌లో సొంతంగా ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలంటే ఒకో అపార్ట్‌మెంట్‌కు దాదాపు రూ. 3 లక్షలు అవసరమవుతాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఒకో కుటుంబంపై రూ. 30వేల నుంచి రూ. 50 వేలు భారం వేసేందుకు నిర్ణయం తీసుకోవటమేనన్నారు. ఈ లెక్కన హైదరాబాద్‌లో 20 కేవీ పైగా విద్యుత్ వినియోగం చేసే అపార్ట్‌మెంట్‌లలో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకుంటే ప్రజలపై రూ.300 కోట్ల భారం పడుతుందని వివరించారు. పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతోనే ఆ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఈ చర్య ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. వినియోగం పెరిగితే అందుకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం తప్పించుకోవటం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు.ప్రజలకు మౌలిక వసతుల కల్పన బాధ్యత ప్రభుత్వానిదేననే విషయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గుర్తించాలన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తారని ఆశపడి ఓట్లేసినందుకు రేవంత్‌రెడ్డి ప్రజలకు షాక్ ఇస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయకుండానే అనుమతించిన అధికారులను, వాటిని అమ్మిన బిల్డర్లను వదిలేసి అపార్ట్‌మెంట్‌వాసులపై భారం మోపుతారా అని ప్రశ్నించారు. ఇప్పటికే లోడ్ పెరిగిందని అప్రకటిత కరెంట్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కరెంట్ కోతలపై ప్రశ్నిస్తే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం చర్య ఎట్టి పరిస్థితుల్లో సమర్థించలేనిదని ఆయన తేల్చిచెప్పారు. ఈ విషయంలో సీఎం స్పందించాలని, లేదంటే ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# మహారాష్ట్రలో నేడే పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 288 నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ జరగనుంది. ఎన్నికల్లో విజయం కోసం అధికార మహాయుతి కూటమి, విపక్ష మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) హోరాహోరీ తలపడుతున్నాయి.మహాయుతి కూటమి తరపున బీజేపీ 149 స్థానాల్లో, శివసేన 81 స్థానాల్లో, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ 59 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఎంవీఏ తరపున కాంగ్రెస్ 101 స్థానాల్లో, శివసేన(యూబీటీ) 95 స్థానాల్లో, ఎన్సీపీ(ఎస్పీ) 86 స్థానాల్లో బరిలో ఉన్నాయి. పోలింగ్‌కు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. 9.70 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరి కోసం 1,00,186 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నవంబరు 23న ఎన్నికల కౌంటింగ్ జరగనుంది.జార?ండ్‌లో బుధవారం జరిగే రెండో, ఆఖరి విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## జీశాట్-20 ప్రయోగం సక్సెస్

వాణిజ్యపరంగా ఇస్రో, స్పేస్‌ఎక్స్ మధ్య ఇదే తొలి ప్రయోగం. అయితే, ఈ ప్రయోగాన్ని ఇస్రో పూర్తిగా చేపట్టకుండా స్పేస్‌ఎక్స్‌తో జట్టు కట్టడంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. దీనిపై ఇస్రో మాజీ ఛైర్మన్ కే శివన్ స్పందించారు. 'ఇస్రో ప్రయోగ వాహనాల సామర్థ్యాన్ని మించి జీశాట్ ఉపగ్రహం బరువు ఉంది. అందుకే దీన్ని ఇస్రో ద్వారా కాకుండా స్పేస్‌ఎక్స్ ద్వారా ప్రయోగించారు. ఇస్రోలో ఉన్న రాకెట్లు 4వేల కిలోల బరువున్న ఉపగ్రహన్ని మోసుకెళ్లగలవు. కానీ జీశాట్ బరువు 4700 కిలోలు. అందుకే స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్‌ను వాడుకొన్నాం' అని ఆయన తెలిపారు.

# కేసీఆర్.. కాస్కో

(మొదటి పేజీ తరువాయి)

తేల్చుకుందాం" అని సవాల్ చేశారు. మంగళవారం హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "ఫామ్‌హౌసలో మౌనంగా పడుకుంటే ఆయన సంగతి నాకు తెలియదనుకున్నాడేమో! ఆయన ముందు తెలుసు.. వెనుక తెలుసు. ఆయన ఉపాయం తెలుసు.. ఉబలాటం తెలుసు. అన్నింటికీ కుక్కకాటుకు చెప్పుదెబ్బ అనే మందు నా దగ్గర సిద్ధంగా ఉంది. తప్పకుండా ఆ మందును ఆయనకు పెడతా" అని కేసీఆర్‌నుద్దేశించి రేవంత్ వ్యాఖ్యానించారు. పది నెలల్లో ప్రజలు ఏదో కోల్పోయారని కేసీఆర్ అంటున్నారని, కానీ.. ఎవరూ ఏమీ కోల్పోలేదని రేవంత్ చెప్పారు. కేసీఆర్ ఇంట్లో మాత్రం నలుగురు ఉద్యోగాలు కోల్పోయారని ఎద్దేవా చేశారు. తండ్రీకొడుకుల నౌకరీ ఊడగొడితే తెలంగాణ యువతకు 50 వేల ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. వరి వేసుకుంటే ఉరేనని ఆనాడు కేసీఆర్ మాట్లాడారని, ఆయన ఫామ్‌హౌసలో 110 ఎకరాల్లో వరి సాగు చేస్తే ఆ బండారం తాము బయట పెట్టామని సీఎం రేవంత్ అన్నారు. నేడు బాజాప్తా తెలంగాణ సమాజం 66 లక్షల ఎకరాల్లో కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండిస్తోందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఏనాడూ ఇంత పంట రాలేదని చెప్పారు. కనీస మద్దతు ధర కల్పించడమే కాకుండా సన్నవడ్లకు రూ.500 బోనస్ కూడా ఇచ్చి కొంటున్న రాష్ట్రం మనదేనని, దేశంలోనే రైతులను ఆదుకున్న ప్రభుత్వం తమదని అన్నారు. 23 లక్షల రైతు కుటుంబాలకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని చెప్పారు. ఇంకా కొంతమంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని, ఖాతాల్లో తప్పులు సరి చేసుకుంటే అందరికీ రుణమాఫీ చేసే బాధ్యత తనదని సీఎం హామీ ఇచ్చారు. సమ్మక్క- సారలమ్మ, భద్రకాళి సాక్షిగా పంద్రాగస్టుకు రుణమాఫీ చేస్తానని చెప్పి.. చేసి చూపించానన్నారు. రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. 11 నెలల్లో 1.10 కోట్ల మంది ఆడబిడ్డల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.3,700 కోట్లు ఖర్చు పెట్టామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా.. రూ.34 వేల కోట్లతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులను మహిళా సంఘాలకు ఇవ్వాలనుకుంటున్నామని చెప్పారు.



## నీ దుఃఖం, బాధ ఏంటో చెప్పు..

"చంద్రశేఖర్‌రావు! నీ దుఖం ఏందో.. బాధ ఏందో చెప్పు. నువ్వు చెప్పింది నిజమైతే.. అసెంబ్లీకి రా! చర్చ పెడతాం.. తేదీ, సమయం నువ్వే చెప్పు. ఆరోజే అసెంబ్లీ పెడతా. ఓడితే పోయి ఇంట్లో పడుకుంటావా? రాహుల్‌గాంధీని చూసి నేర్చుకో! మూడుసార్లు ఓడిపోయినా ప్రతిపక్షంలో ఉండి.. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 150 రోజులు 4వేల కిలోమీటర్లు మండుటెండల్లో.. మంచుకొండల్లో పాదయాత్ర చేసి ప్రజలకు అందుబాటులో ఉన్న బాధ్యతాయుత ప్రతిపక్ష నాయకుడాయన. నువ్వు మాత్రం అధికారంలో ఉంటే దోచుకుంటా.. ప్రతిపక్షంలో ఉంటే ఫామ్‌హౌసలో పడుకుంటా అంటున్నవు. ఇదేనా నీ విధానం? నిజంగా ప్రజలు కష్టాల్లో ఉంటే ఫామ్‌హౌసలో గాడిద పళ్లు తోముతున్నావా? ప్రజల్లోకి వచ్చి మాట్లాడు.. ప్రతిపక్షంగా ప్రభుత్వానికి ఏం సూచన చేస్తావో చెయ్. వినడానికి మేం సిద్ధంగా ఉన్నాం. నువ్వు లేవనెత్తిన అంశాలు సహేతుకంగా ఉంటే సరిదిద్దేందుకు సిద్ధంగా ఉన్నాం" అని సీఎం రేవంత్ అన్నారు. పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని, ధనిక రాష్ట్రాన్ని రూ.7 లక్షల కోట్ల అప్పులపాలు చేశారని ఆరోపించారు.

# అమీన్‌పూర్ పెద్ద చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్

## ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్న రంగనాథ్

## ముంపు బాధితులకు అండగా ఉంటామని హామీ

**పటాన్ చెరువు/అమీన్ పూర్ ,నవంబర్ 19(డైలీ రిపోర్ట్):** మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆక్రమణలకు పాల్పడ్డారని తమకు ఫిర్యాదులు వచ్చాయని, అలాగే, పార్కులు, రోడ్లు కబ్జాకు గురైనట్లు కూడా కొంతమంది ఫిర్యాదు చేశారని, విచారణ చేసి నిజమని తేలితే హైడ్రా తప్పకుండా చర్యలు తీసుకుంటుందని కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ అమీన్‌పూర్ పెద్ద చెరువును సందర్శించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆయన ఈ చెరువును సందర్శించారు. వెంకటరమణ కాలనీ, శంభునికుంట, అమీన్‌పూర్ పెద్ద చెరువు, హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీ, పద్మారావు నగర్ సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పెద్ద చెరువు ముంపు బాధితులకు హైడ్రా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అమీన్‌పూర్ పెద్ద చెరువుకు సంబంధించి అనేక ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. అలుగులు, తూములు మూసేయడంతో ఎఫ్‌టీఎల్ పెరిగినట్లు స్థానికులు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిని ప్రత్యేక టెక్నికల్ బృందంతో సర్వే చేయిస్తామన్నారు. సర్వే నివేదిక ఆధారంగా ప్రభుత్వంతో చర్చించి మూడు నెలల్లో ఫలితాలతో వస్తామని హామీ ఇచ్చారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మరికొన్ని ప్రాంతాలు ఆక్రమణకు గురైనట్లు తమకు సమాచారం అందిందన్నారు. అన్నింటి పైనా పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామన్నారు. ఈ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉందని, అందుకే కబ్జాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. తాము చెరువుల పునరుద్ధరణను ప్రధాన అజెండాగా పెట్టుకున్నామని, అయితే ఆక్రణకు గురైన రోడ్లను కూడా పునరుద్ధరిస్తామన్నారు. అధికారులు తప్పు చేసినట్లు తేలినా చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు.

**స్థానికుల ఫిర్యాదుపై స్పందించిన కమిషనర్**



తమ భూములు కబ్జాకు గురవుతున్నాయని స్థానికులు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువులోని నీరు తూముల ద్వారా కిందకు వదలడంతో ఎగువన ఉన్న తమ నివాసాలు మునిగిపోయినట్లు హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లారు.



ఈ అంశంపై నిపుణుల కమిటీని వేసి నివేదికను తెప్పించుకుంటానని హైడ్రా కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తానన్నారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం చర్యలు ఉంటాయన్నారు



జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2024-25 డ జిల్లాస్థాయి ఇన్స్పైర్ అవార్డుల ప్రదర్శన 2023-24 కార్యక్రమానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారికి ఆహ్వాన పత్రికను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.... సంగారెడ్డి :(డైలీ రిపోర్ట్ )19నవంబర్



## జీవో 16ను కొట్టేసిన తెలంగాణ హైకోర్టు

**డైలీ రిపోర్ట్ :** కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ రాజ్యాంగ విరుద్ధమన్న హైకోర్టు. జీవో 16 ద్వారా వేలాది మందిని రెగ్యులరైజ్ చేసిన గత BRS ప్రభుత్వం. విద్య, వైద్య శాఖల్లోనే ఎక్కువ మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులరైజ్. హైకోర్టు ఆర్డర్‌తో ఆందోళనలో రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్ట్ ఉద్యోగులు. రెగ్యులరైజ్ అయినవారిని తిరిగి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కొనసాగించవచ్చని కోర్టు ఆదేశాలు ఇచ్చిందంటున్న పిటిషనర్లు. కోర్టు ఆర్డర్ కాపీ వస్తే స్పష్టత వస్తుందంటున్న అధికారులు.

# ప్రజాస్వామ్య విలువలను మీడియా వ్యవస్థ సంరక్షిస్తూతుంది: స్థానిక ఎస్సై నవీన్ కుమార్





అనంతగిరి, నవంబర్19, (డైలీ రిపోర్ట్):ప్రజాస్వామ్య విలువలను మీడియా వ్యవస్థ సంరక్షిస్తూతుంది అనిస్థానిక ఎస్సై నవీన్ కుమార్ అన్నారు. అనంతగిరి మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల స్థాయిలో ఏర్పాటు చేసిన సమాజంలో పాత్రికేయుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు 1966లో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) ఏర్పడిందని దానికి గుర్తుగా ప్రతి సంవత్సరం నవంబర్ 16న జాతీయ పత్రికా దినోత్సవాన్ని జరుపుకుంటారని అన్నారు. సమాజ నిర్మాణంలో నేటి విద్యార్థులె రేపటి భవిష్యత్తుకు పునాదులని అన్నారు. అంతేకాకుండా యువత చెడు అలవాటు పడకుండా కాపాడుకుంటే తమ జీవిత భవిష్యత్తు చక్కదిద్దుకోవచ్చు అని అన్నారు. అనంతరం మండల విద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ...విద్యతో పాటు సామాజిక అంశాలపై అవగాహన ఉండాలని,రానున్న పదవ తరగతి బోర్డు ఎగ్జామ్స్ లో మండలంలో అత్యధిక ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులు తల్లిదండ్రులకు చదువుతున్న పాఠశాలలకు మంచి ఖ్యాతి తేవాలని అన్నారు విద్యార్థి దశనుండే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని పేర్కొన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో బహుమతులు పొందిన వారికి ఎస్సై ఎంఈఓ ఎంపీడీవో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సుష్మ, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గరిడేపల్లి మురళి, సతీష్,ఈదయ్య, కరుణాకర్, రాము, ఉపేందర్, చలం, వినయ్ కుమార్, గోపి, మణికంఠ, శ్రీరామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నీటిని ఒడిసిపట్టి భవిష్యత్తు తరాలకు మార్గదర్శం అవుదాం



**వికారాబాద్,నవంబర్19 (డైలీ రిపోర్ట్):** వికారాబాద్ ఎస్‌ఎపి కళాశాలలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, కళాశాల చైర్మన్ మర్రి శశిధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన, వికారాబాద్ లో నీటి భద్రత , మూసినది పునరుజ్జీవంపై నిర్వహించిన రౌంటేబుల్ సమావేశంలో, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి , మాజీ జెడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతా మహేందర్ రెడ్డి , చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేయస్ రత్నం , బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు కోకట్ మాధవరెడ్డి , ఇతర ప్రముఖులతో కలిసి వికారాబాద్ నియోజకవర్గ బిజెపి పార్టీ కోఆర్డినేటర్, జిల్లా దిశా కమిటీ సభ్యులు వడ్ల నందు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్ పల్లి మాజీ ఎంపిటిసి బొమ్మన్న గారి కృష్ణ మొదటి వర్ధంతి నిర్వహించిన కుటుంబ సభ్యులు...

శంకర్ పల్లి మాజీ ఎంపీటీసీ , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కురుమ సంఘం మాజీ సెక్రెటరీ, శంకర్ పల్లి మహాత్మ జ్యోతిరావు పూలే వ్యవస్థాపక అధ్యక్షులు, శంకర్పల్లి మండల బిసి ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, ఎన్ టి పి సి భూ బాధితుల సంఘం అధ్యక్షులు, పటాన్చెరు వెంకటకృష్ణ కాంటా వెజిటబుల్ మార్కెట్ అధినేత, బొమ్మన గారి కృష్ణ ప్రథమ వర్ధంతిని కుటుంబ సభ్యులు శంకర్ పల్లి లో గల మనీ గార్డెన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ క్రమశిక్షణ ఊపిరిగా, కష్టమే ఇష్టంగా నిరాడంబతరమే ఆలంబనగా చెరగని నవ్వుతూ ఎల్లప్పుడూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎల్లప్పుడూ సమాజ హితం కోసం పరితపిస్తూ అందరి హృదయలలో మంచి పేరు సంపాదించుకున్న కీర్తిశేషులు బొమ్మను గారి కృష్ణ మా నుండి మీరు భౌతికంగా దూరమైన నేటితో ఒక సంవత్సరం గడిచిన మీ మధుర స్మృతులు మా మదిలో ఎల్లప్పుడూ మెదులుతూనే ఉంటాయని ప్రముఖ వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మా కుటుంబం యొక్క పెద్దదిక్కు అయినటువంటి బొమ్మనగారి కృష్ణ భౌతికంగా మాకు లేకున్నా కానీ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచినందుకు మేము ఎంతో సంతోషిస్తున్నామని అదేవిధంగా ప్రతి ఒక్క పేద ప్రజలకు ఎలాంటి సహాయం కావాలన్నా నేనున్నాను అని ముందుండే వ్యక్తి బొమ్మనగారి కృష్ణ అని వాళ్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ భానూరి వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉదయ మోహన్ రెడ్డి, అన్ని పార్టీల నేతలు, కీర్తిశేషులుబొమ్మన్న గారి కృష్ణకుటుంబ సభ్యులైనటువంటి జైపాల్ యాదవ్, వీరేశం యాదవ్, పాండు యాదవ్, విట్టల్ యాదవ్, ప్రభు యాదవ్, బొమ్మన్నగారి కృష్ణ కుమారులు అయినటువంటి అజయ్ యాదవ్, తదితర బొమ్మన్న గారి కృష్ణ కుటుంబ సభ్యులు, ఆయన అభిమానులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి లో ఘనంగా ఇందిరా గాంధీ 107వ జయంతి వేడుకలు



**సంగారెడ్డి, నవంబర్ 19 (డైలీ రిపోర్ట్):** స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 107వ జయంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఐబీ వద్ద జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.వారు ఇందిరాగాంధీ విశిష్ట సేవలను గుర్తు చేసుకుంటూ, ఆమె చూపించిన నాయకత్వం, దేశానికి అందించిన సేవల గురించి హర్షం వ్యక్తం చేశారు. స్వతంత్ర భారతదేశం చరిత్రలో ఆమె పాత్రను కొనియాడుతూ, ఆమె ఆదర్శాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఇందిరా గాంధీ ఆశయాలను సాదిద్దాం**

%క్యాంప్ కార్యాలయంలో పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులుమెదక్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని మెదక్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ తొడుపునూరి చంద్రపాల్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ ఆశయాలను సాదిద్దామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బొజ్జ పవన్, కౌన్సిలర్ లు రాగి అశోక్, గోదల సాయిరాం, లక్ష్మీనారాయణ, సమీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు దాయర రవి, దేవుల, మంగ రమేశ్ గౌడ్, ఎండి. సూఫి, అమీర్, సంజీవ్, ప్రభాకర్, అయితారం ప్రవీణ్, మందుగుల గంగాదర్, పురం వెంకటనారాయణ, నాగరాజు, ఉమర్, భూపతి యాదవ్, చంద్రబోస్, ప్రవీణ్, గూడూరి క్రిష్ణ, గూడూరి శంకర్, అశోక్, దశరథం, బట్టి సాయిమోహన్, విశాల్, సంజీవ్, ఘణపురం మండల నాయకలు శ్రీకాంత్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## లగచర్లలో అర్థరాత్రి గిరిజన ఆడబిడ్డలపై దమనకాండే కాదు..

**పట్టపగలు వెళ్లిన మహిళా సంఘాల నేతలపైనా దౌర్జన్యమా ??**

నిజనిర్ధారణకు వెళ్లిన వారిని కాంగ్రెస్ ఎందుకు అడ్డుకుంటోంది ? వాస్తవాలను తొక్కిపెట్టాలని ఈ సర్కారు ఎందుకు ప్రయత్నిస్తోంది ?

సీఎం సొంత ఇలాకాలో ఇంతటి నిర్బంధం ఏమిటి ?

కొడంగల్ ఏమైనా పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉందా..?

లేక లగచర్ల.. చైనా బార్డర్లో ఉన్న కల్లోలిత ప్రాంతమా ??

పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఇంటర్ నెట్ సేవలు నిలిపివేశారు

కొడంగల్ కు వెళ్లే అన్ని దారుల్లో పోలీసుల పహారా ఏర్పాటుచేశారు

మీరెంత దాచే ప్రయత్నం చేసినా.. నిజం దాగదు..

ఇప్పటికే లగచర్లలో కాంగ్రెస్ సర్కారు కిరాతకం ఢిల్లీకి చేరింది

దేశ రాజధానిలో మీ అరాచకపర్వంపైనే తీవ్ర చర్చ జరుగుతోంది

ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలను అడ్డుకోవడం అంటేనే..

కాంగ్రెస్ సర్కారు తప్పుచేసినట్టు ఒప్పుకున్నట్టే లెక్క..

మహిళా సంఘాలను అడ్డుకున్నందుకు క్షమాపణలు చెప్పాలి

లగచర్లలో నిర్బంధాన్ని ఎత్తివేసి.. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి.

**వికారాబాద్,నవంబర్ 19(డైలీ రిపోర్ట్)**

**వామపక్ష నేతలతో ఈ నెల 21న లగచర్ల బాధిత రైతులను కలుస్తాం..మమ్మల్ని అక్కడికి వెళ్లనీయకుంటే లగచర్లకే పరిమితమైన ఈ సమస్యను రాష్ట్ర సమస్యగా మారుస్తాం – సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరబద్రం**



**ఖమ్మం :(డైలీ రిపోర్ట్ )19నవంబర్**

## పక్కకు ఒరిగిన భవనం

హైదరాబాద్ మాదాపూర్ సమీపంలో కలకలం

నాలుగంతస్తుల భవనంలోని అందరూ సురక్షితం



గచ్చిబౌలి (హైదరాబాద్): రాజధాని నగరంలోని మాదాపూర్ ఐటీ కారిడార్‌కు చెంతనే ఉన్న సిద్దిఖీనగర్‌లో నాలుగు అంతస్తుల భవనం పక్కకు ఒరిగిన ఘటన కలకలం రేపింది. వసుకుల లక్ష్మణ్ అనే వ్యక్తి ప్లాట్ నం. 1639లో 70 గజాల స్థలంలో జీప్లస్ ఫోర్ భవనాన్ని నిర్మించారు. ఫ్లోర్‌కు రెండు పోర్షన్ల చొప్పున నాలుగు ఫ్లోర్లు నిర్మాణం చేశారు. ఆ భవనంలో మొత్తం 48 మంది అద్దెకు ఉంటున్నారు. వారంతా చెంతనే ఉండే ఐటీ కంపెనీల్లో హౌజ్‌కీపింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో గోడ కూలినట్లు శబ్దం వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. కానీ రాత్రి 8.30 గంటల సమయంలో పెద్దగా శబ్దం వచ్చి భవనం ఒరిగిపోతోందని అరుపులు వినిపించడంతో అందరూ భయాందోళనలకు గురయ్యారు. ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ఆదరాబాదరాగా కిందకు వచ్చేశారు. ఇంతలోనే మూడో అంతస్తులో ఉండే సాదిక్ హుస్సేన్ కిందికి దూకగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఈలోగా అందరూ కిందకు వచ్చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే భవనం నిర్మించినట్లు తెలుస్తోంది.

**పక్క స్థలంలో గుంతలు తీయడంతోనేనా..**

ఈ భవనం పక్కనే ఉండే 1605, 1638 ప్లాట్లను కలిపి భవనం నిర్మించేందుకు పిల్లర్లు వేయడానికి గుంతలు తవ్వారు. వీటితో భవనానికి ఇబ్బంది వస్తుందని ఈ భవన యజమాని వారిని హెచ్చరించారు. అయినా వారు వినలేదు. దీనివల్లే ఈ భవనం పరిస్థితి ఇలా మారిందని కొందరు అంటున్నారు. ఘటనా స్థలాన్ని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ, మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది పరిశీలించారు.పక్కకు ఒరిగిన భవనం చుట్టూ ఉండే పది భవనాల్లో నివాసం ఉండేవారిని ముందు జాగ్రత్త చర్యగా ఖాళీ చేయించి వేరేచోటికి తరలించారు. ఈ భవనం ముందు కేవలం పదిఫీట్ల రోడ్డు మాత్రమే ఉంది.

## దేశాభిమానం లేనివారే ఇందిరా గాంధీపై విమర్శలు చేస్తున్నారు: భట్టి



హైదరాబాద్: ప్రపంచ స్థాయిలో భారత్‌ను నిలబెట్టడంతో దివంగత మాజీ ప్రధాని ఇంధిరా గాంధీ పాత్ర కీలకపాత్ర పోషించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశ సమగ్రత కోసం ఇందిరా గాంధీ ప్రాణాలు విడిచారని తెలిపారు. మంగళవారం భారత తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ఇందిరా గాంధీపై నెగెటివ్‌గా సినిమాలు తీసే వారికి కౌంటర్ ఇచ్చారు.దేశ సమగ్రతపై అవగాహన లేని వారు కావాలని సినిమాలు చేస్తున్నారరని మండిపడ్డారు. గతం గురించి తెలియని వారు ఇందిరా గాంధీ చరిత్రను వక్రీకరిస్తున్నారని, గతం గురించి తెలిసిన వారు ఆమెకు చేతులు ఎత్తి నమస్కరిస్తారని తెలిపారు. దేశాభిమానం లేనివారే ఇందిరా గాంధీపై విమర్శలు చేస్తున్నారని, ఉద్దేశ్యపూర్వకంగా ఆమెనె నెగెటీవ్‌గా చూపిస్తున్నారని అన్నారు. మాజీ ప్రధానిపై తప్పుడు ప్రచారం చేస్తూ దేశాన్ని విభజించి లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శలు గుప్పించారు. దేశం కోసం ప్రాణాలను తృణపాయంగా వదిలేసిన గొప్ప చరిత్ర ఇందిరా కుటుంబానిదని అన్నారు.'ఇందిరమ్మ స్ఫూర్తితో మహిళలకు పథకాలు అందిస్తున్నాం. అధికారంలోకి రాగానే మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఆర్టీసీలో ఉచిత రవాణా కోసం నెలకు రూ. 400 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ ఇస్తున్నాం. ఇందిరమ్మ ఆశయ స్ఫూర్తితో ఇందిరమ్మ రుణాలు ఇవ్వబోతున్నాం.

**తెలంగాణ వైపు దేశం చూపు..**

బలహీన వర్గాల కోసమే సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్నాం రాష్ట్ర ప్రజలందరికీ వనరులు అందజేయడానికే ఈ సర్వేచేస్తున్నాం. యావత్ భారతదేశం తెలంగాణ వైపు చూస్తోంది. అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు సమానంగా అందాలనేది సర్వే ఉద్దేశ్యం. భూములు కోల్పోయే వారిని అన్ని రకాలు ఆదుకుంటాం. అందరికీ నచ్చ చెప్పే పరిశ్రమలకు భూమి తీసుకుంటాం. కొద్దిమంది రాజకీయ నేతలు కుట్రలతో అమాయకులను రెచ్చగొడుతున్నారు,


**యువతకు ఉద్యోగాలిచ్చే బాధ్యత కాంగ్రెస్‌ది..**

బీజేపీ నేతలు ఊహల్లో బతుకుతున్నారు. దేశాన్ని విభజించి రాజకీయంగా లబ్ధి పొందే కుట్రపన్నుతున్నారు. బీజేపీ చెప్పిన ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి? పేదల అకౌంట్లో 15 వేలు వేస్తామని మోసం చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలిచ్చే బాధ్యత కాంగ్రెస్‌ది. జాబ్ క్యాలెండర్, యూపీఎస్ సీ తరహాలో ఉద్యోగాలు భర్తీ చేస్తాం' అని తెలిపారు.

## పట్నం నరేందర్‌రెడ్డికి ఊరట



హైదరాబాద్, లగచర్ల అధికారుల దాడి కేసులో అరెస్టైన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. చర్లపల్లి జైల్లో ఆయనకు స్పెషల్ బ్యారేక్ ఇవ్వాలని జైలు సూపరిండెంట్‌ను హైకోర్టు ఆదేశించింది.తోటి ఖైదీలతో కాకుండా పట్నం నరేందర్ రెడ్డికి ప్రత్యేక బ్యారేక్ ఇవ్వాలని పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారన జరిపిన కోర్టు.. ఇంటికి భోజనానికి కూడా అనుమతిస్తూ ఆదేశాలిచ్చింది. అలాగే.. తన రిమాండ్‌ను కొట్టి వేయాలని నరేందర్ రెడ్డి వేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ శ్రీదేవి బెంచ్ మరికాసేపట్లో విచారణ జరపనుంది.మరోవైపు నరేందర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణనువికారాబాద్ కోర్టు వాయిదా వేసింది. రిమాండ్ ఆర్డర్‌ను క్వాష్ చేయాలని నరేందర్‌రెడ్డి వేసిన పిటిషన్ హైకోర్టులో పెండింగ్ ఉండడంతో బెయిల్ పిటిషన్ విచారణను వాయిదా వేస్తున్నట్లు వికారాబాద్ కోర్టు తెలిపింది.తదుపరి విచారణను వికారాబాద్ కోర్టు వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.



## ఆవును హతమార్చిన పెద్దపులి

నార్నూర్: మండలంలో ని చోర్గావ్ గ్రా మ శివారులో సోమవారం సాయంత్రం తార్యానాయక్ అనే రైతుకు చెందిన ఆవుపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. ఆదివారం ఉదయం ఉట్నూర్ చిన్నునా యక్ తండా, హస్నాపూర్, చాందోరి మీదుగా మండలంలోని గుంజాల శివారుకు చేరుకున్న పెద్దపులి మధ్యాహ్నం నుంచి అదే ప్రాంతంలో తలదాచుకుంది.రాత్రి జైనూర్ లేదా బేల మీదుగా వెళ్లిపోతుందని అటవీశాఖ అధికారులు భావించారు. కానీ సోమవారం గుంజాల వద్ద ప్రత్యక్షం కావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. సాయంత్రం చోర్గావ్ శివారులో ఆవుపై దాడి చేసి బాబేఝరి వైపు మళ్లిందని స్థానికులు పేర్కొంటున్నారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707